# రక్తకన్నీరు



**తిప్పావఝల సుబ్రహ్మణ్యం**

**రాత్రి తొమ్మిది గంటలయింది. రైల్వే ప్లాట్‌ఫారం వచ్చి పోయేవారితో సందడిగా ఉంది. హైదరాబాదుకు పోయే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ వచ్చే టైం కావస్తోంది. ఇంకా మా అన్నగారు రాలేదేమిటా అనుకుంటూ ప్రక్కనే ఉన్న బెంచీ మీద కూర్చున్నాను.**

ఉదయం 10-30 గంటలకు హైదరాబాదు నుండి మా పెద్దన్నగారి కుమారుడు కృష్ణమోహన్ చనిపోయాడని ఉత్తరం వచ్చింది. ఉత్తరం చూసి మా ఆవిడ కన్నీరు పెట్టుకుంది. నేనైతే ఇది ఎలా జరిగిందబ్బా అని ఆవేదనలో పడ్డాను. ఇంతలో మా అన్న టి.వి.ఎస్. శర్మ గారు ఫోన్ చేశారంటూ పక్కింటావిడ వచ్చింది. విషయం తెలిపి, రాత్రి చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌కు హైదరాబాదు పోదామని, నెల్లూరు రైల్వే స్టేషన్‌లో ఉండమని చెప్పాడు. వారి కోసమే ఎదురుచూడ్డం.

ఇంతలోనే మా అన్నగారు వచ్చారు. చాలా దిగులుగా కనిపించారు. డిసెంబరు సెలవులలో వచ్చినప్పుడు కూడా ఎంతో చలాకీగా ఉన్న మోహన్ శాశ్వతంగా మనకు కనిపించడు అంటే ఆ బాధ పగవాడికి కూడా వద్దు. ట్రైన్ వచ్చింది. ఎక్కాము. కొద్దిసేపు మాటలు లేవు.

'ఉత్తరంలోని వార్త నిజమేనంటావా?' అన్నాడు. 'నారాయణన్న స్వయంగా రాస్తే ఎలా కాదనుకుంటాము?' అన్నాను.

మా పెద్దన్న హైదరాబాదు అగ్రికల్చర్ డైరెక్టరేటులో సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కూతురు. గ్రామీణ ప్రాంతమయిన దగదర్తిలోని పిల్లలకు క్రికెట్ నేర్పింది వాడే! ముఖ్యంగా మా అన్నగారి కుమారులు కృష్ణప్రసాద్, రామ్‌ప్రకాష్‌లకు వాడంటే చాలా ఇష్టం. సెలవులలో ఇక్కడికి వచ్చినప్పుడు, సిటీని గూర్చి తెలియనివారికి అన్ని విషయాలు సమగ్రంగా చెప్పేవాడు. వారిద్దరికీ క్రికెట్ గురువు వాడే! పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు బాగా రాశానని సెలవులలో వస్తానని జాబు కూడా రాశాడు. ఇంతలో హఠాత్తుగా ఈ వార్త ఏమిటి?

మా నాన్నగారు ఆరు నెలల క్రితమే స్వర్గస్థులైనారు. సెలవులలో వాడు వస్తే వాడిని వదలి ఉండేవారు కాదు. మా పెద్దన్న ఇంజనీరు కాలేకపోయినా వాడైనా ఇంజనీరు కావాలని ఆయన ఆశ. పెద్దకుమారుడైనందున వాళ్ళ నాన్నను వారెంత అల్లారుముద్దుగా పెంచామో చెబుతుండేవారు. వాడికి కూడా వాళ్ళ నాన్నను బాధపెట్టకుండా సుకుమారంగా చూసుకొమ్మని సలహాలిచ్చేవాడు. పొరబాటున ఆయన బ్రతికుంటే ఈ వార్త విని గుండె ఆగి చనిపోయేవారేమో! బహుశా ఆయన వారసుడగుటచేత కాబోలు మా తండ్రిగారికి వాడంటే పిచ్చి ప్రేమ. మా అన్నగారు చెప్తుంటే ఊకొడుతున్నాను. కాలం గడచిపోతున్నది. ఉదయం 7 1/2 గంటలకు హైదరాబాదు చేరాము.

మా పెద్దన్నవాళ్ళు ఉండేది మల్కాజ్‌గిరి, రాధాకృష్ణ నగర్‌లో. సిటీ బస్సులో ఎక్కి రాధాకృష్ణ నగర్‌లో దిగాము. ఈ మధ్యనే ఆ ప్రాంతంలో మా అన్నగారు చేరినట్లు తెలిసింది. మాకు కొత్త. ఎవర్ని అడిగినా చెప్పడంలేదు. మా అన్న శర్మగారికి తటాలున ఒక ఆలోచన తట్టింది. కొందరు పిల్లలు అక్కడ క్రికెట్ ఆడుతున్నారు. వాళ్ళ దగ్గరకు వెళ్ళి 'కృష్ణమోహన్ ఇల్లు తెలుసా?' అని అడిగాడు. అప్పుడే ఆట ముగించి వెళ్తున్నారు. వారు జవాబు చెప్పలేదు. ఒక్కడు మాత్రం 'మాతో క్రికెట్ ఆడే కృష్ణమోహన్ ఇల్లు అయితే చూపిస్తా'నని ఇల్లు చూపించి వెళ్ళాడు.

ఇంట్లోకి వెళ్ళాము. నారాయణన్న లేడు. మా వదిన, 8 వ తరగతి చదువుతున్న వరలక్ష్మి మాత్రం ఉన్నారు. మమ్ములను చూడగానే వరాలు పెద్దగా ఏడ్చింది. మా వదిన కన్నీరు తుడుచుకుంటూ, లోపలికి వెళ్ళి రెండు కాఫీలు తెచ్చి తాగమంది. రాత్రంతా నిద్ర లేనట్లుంది. కాసేపు విశ్రాంతి తీసుకొమ్మని చెప్పింది. కానీ విషయం అడిగాను. వాడు చనిపోయిన విధానం చెప్పగానే మా అన్న శర్మ ఒక్కసారిగా భోరున విలపించాడు. నేను సముదాయించవలసి వచ్చింది. వాడు చనిపోయిన విధానం వింటే వళ్ళు గగుర్పొడిచింది.

పరీక్షలు అయిన పిమ్మట కృష్ణమోహన్ అయిదు రోజులుగా ఫ్రెండ్స్‌తో కలిసి సినిమాలకు పోతుండేవాడట. ఆ రోజు వాళ్ళ నాన్నను అడిగి 50 రూపాయలు తీసుకొని సినిమాకెళ్ళి వచ్చాడట. మా వదిన వాడి ఫ్రెండ్స్ ముందర "ఇంట్లో ఇంకేమీ పని లేదా? రోజే ఇదేనా వ్యాపారం? అని అన్నదట. తన ఫ్రెండ్స్ ముందు ఇలాగేనా మాట్లాడేది, అని వాళ్ళమ్మ బజారుకు సరకుల కోసం వెళ్లగానే వంటగది లోపలికెళ్ళి గడియ వేసికొని, కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడట. వాళ్ళమ్మ ఇంటికి తిరిగి వచ్చేసరికి జరగవలసినది జరిగిపోయింది. సాయంత్రం మా పెద్దన్న

వచ్చేసరికి ఉదయం సినిమాకు పోతానని 50 రూపాయలు తీసుకున్న ఏకైక పుత్రుడు 16 సంవత్సరాలకే నిర్జీవుడవటం చూసి, ఆ విషయాన్ని జీర్ణించుకోలేక దాదాపు పిచ్చివాడిగా తయారయ్యాడు.

మా వదిన కన్నీరు తుడుచుకుంటూ 'వాడింత అఘాయిత్యం చేస్తాడని అనుకోలేదు. ఒక్కగానొక్క కొడుకు. దేవుడు నిర్దయగా తీసుకెళ్ళాడు. ఇంతకూ వాడు మాకు ప్రాప్తం లేదు' అంటూ మీ అన్న సరిగ్గా నిద్ర కూడా పోవడం లేదు. మీరంటే ఆయనకు చాలా ఇష్టం. నాలుగు రోజులు ఆయనకు తోడుగా ఉండి, ఆయనను మామూలు ప్రపంచంలో పడేట్లు చూడండి నాయనా!" అంది.

* * *

సాయంత్రం మా పెద్దన్న వచ్చాడు. చాలా డీలా పడిపోయాడు. నాకు, మా పెద్దన్నకు మాటలు చాలావరకు తక్కువే. మా అన్న శర్మ ఆయనతో చాలా క్లోజ్‌గా ఉంటాడు. మా పెద్దన్న చెప్పే మాటలు వింటూ ఆయనను ఓదార్చాడు. వాడి మరణం మాకే ఇలా ఉంటే ఆయన సంగతి చెప్పలేము. నిజానికి మా అన్నగారని గొప్పగా చెప్పుకోవటం కాదు. ఆయన చాలా మేధావి. ఆయనకు తెలియని సంగతులు లేవు. సాధారణ వార్తల నుంచి వేదాంతం వరకు ఆయనకు పూర్తిగా తెలుసు. అందుకే మా ఊర్లో మా నాన్న, పెద్దనాన్న అన్ని విషయాలలోనూ ఆయనని సంప్రదించేవారు. మా ఊళ్ళో కూడా ఆయన చాలా తెలివైనవాడన్న ప్రత్యేక గౌరవం. ఆయనను మేము ఓదార్చేవాళ్ళమా!

అయినా కన్న తీపి. మాట్లాడేటప్పుడు ఆయనకు తెలీకుండానే కన్నీళ్ళు కారుతుండేవి. వాడి భవిష్యత్తు కొరకు ఆయన ఆరాటం. బ్యాంకు బ్యాలెన్సులు, కుటుంబ ఖర్చులు అంతా వాడికి తెలియచేసేవాడట. వాడి చదువుకు దిగులు లేకుండా జీతంలోనే కొంత మిగిల్చి బ్యాంకులో వేశానని, వాడికి జీవితం పట్ల పూర్తి అవగాహన ఏర్పరిచానని, ఎవరు ఏమన్నా పట్టించుకోవద్దని, పెద్దవాళ్ళు ఏమన్నా మన మంచికోసమేనని వాడికి తెలియచెప్పిన విషయాలు, ఇంజనీరు కావాలని వాడి ఆశ. వాడితో జరిగిన అనేక సంఘటనలు గుర్తుకు తెచ్చుకొని మాకు చెప్పి బాధపడుతున్నాడు.


పదిహేను సంవత్సరాలుగా వాడిని పెంచిన ఆ తల్లిదండ్రులకు వాడు మూర్ఖంగా మృత్యువు దరి చేరిన తీరు ఎంత బాధను కల్గించిందో! వారి హృదయావేదన వర్ణనాతీతం.

మేము వచ్చి ఆరు రోజులయింది. ఆత్మీయులము దగ్గర ఉన్నామనే భావన కాబోలు మా అన్నగారు చాలావరకు మామూలు మనిషయ్యాడు. ఆ రోజు ఆఫీసుకు కూడా వెళ్ళాడు. మా అన్న శర్మగారు కూడా అయనతో ఆఫీసుకెళ్ళాడు. ఇందుకూరుపేట నుండి వాళ్ళ ఆఫీసుకు ఫోను వచ్చిందట. మా పాప నాన్న కావాలని ఏడుస్తోందని, వీలైతే త్వరగా రమ్మని. సాయంత్రం పెద్దన్నతో రేపు బయలుదేరుతామని చెప్పాము.

గతవారం రోజులుగా గడ్డం బాగా పెరిగిపోయింది. మా అన్న కూతురు వరలక్ష్మి సలహాపై సమీపంలోనే గల సెలూన్‌కెళ్ళాను. షేవింగు చేయించుకుంటున్నాను. "ఏ ఊరు మీది? కృష్ణమోహన్ బంధువువా?" అని సెలూన్ అతను అడిగితే అవును మాది ఇందుకూరుపేట అని చెప్పాను. కృష్ణమోహన్ చనిపోక ముందు రోజు సెలూన్‌కు క్రాఫ్ కటింగ్‌కు వచ్చాడట. నాలుగు ఐదు రోజులలో స్వంత ఊరు దగదర్తికి పోతానని, అక్కడ వాళ్ళ తమ్ముళ్ళు కృష్ణప్రసాద్, రామ్‌ప్రకాష్‌లతో క్రికెట్టు ఆడడానికి ఒక కొత్త బేట్ కొనాలని అన్నాడట. మా బాబాయి ఇందుకూరుపేటలో టీచరుగా ఉంటున్నాడని అక్కడ నాలుగు రోజులుండి దగ్గరలోనే గల మైపాడు బీచ్ చూడాలని, ఇంతకాలం ఆ బీచ్‌ని చూడలేదని అన్నాడని చెబుతున్నాడు. ఇందుకూరుపేట బాబాయికి ఈత బాగా వచ్చని, వారితో మైపాడు పోవాలని చెప్పాడట. ఇందుకూరు పేట సుబ్బయ్య బాబాయికి తనంటే ఎంతో ఇష్టమని చిన్నప్పుడు తనని ఎత్తుకొని గిరగిరా తిప్పేవాడని ఇప్పటికీ అమ్మా, నాన్నలు చెబుతుంటారని చెప్పాడట. ఇంకొక బాబాయి నరసింహమూర్తి ఉండే మాపూరులో కొన్ని రోజులుండి, ఒంగోలులో గల వాళ్ళ మామయ్య ఇంట్లో కొన్ని రోజులు గడిపి తిరిగి వచ్చి కాలేజీలో చేరతానని చెప్పాడట. తనని బాబాయిలు, పినతల్లులు ప్రేమగా చూసుకుంటారని.. ఇంకా ఏదో చెబుతున్నాడు.

ఆ మాటలు వింటున్న నాకు ఏదో అయినట్లనిపించింది. నా శరీరంలోని అణువణువూ కదిలిపోతూ, నరనరాల నుండి ప్రవహిస్తున్న రక్తం గుండెకు చేరి, అక్కడి నుండి కన్నీరు రూపంలో ప్రవహిస్తున్నది. వాడికేం తెలుసు? ఏదో ఊహించుకొని చిన్న కారణంతో, రోషంతో చిన్న వయసులోనే తన నూరేళ్ళ జీవితాన్ని పోగొట్టుకొని, తల్లిదండ్రులను, బంధువులను, సన్నిహితులను బాధించుతున్నాడని తెలిసీ తెలియని వయసులో నిండు నూరేళ్ళ జీవితాన్ని పదహారు సంవత్సరాలకే లోకంతో సంబంధం వదులుకొని, తీరని కోరికలతో మమ్మల్ని వదిలిపోయినా మా మదిలో శాశ్వతంగా విషాదాన్ని మిగిల్చి వెళ్ళాడని. నాకు తెలీకుండానే వాడి మరణవార్త విన్ననాటి నుండి రావాలని కన్నీరును కారుస్తున్నాను.

"అదేమిటిసార్ ఆలోచిస్తున్నారు? ఆ కన్నీరు ఏమిటి? మిమ్ములను బాధపెట్టినట్లున్నాను. సారీసార్! కృష్ణమోహన్ అప్పుడప్పుడూ తీరిక సమయాల్లో ఇక్కడికి వచ్చి మాతో మాట్లాడుతుండేవాడు సార్!" అంటున్న సెలూన్ అతనితో "కృష్ణమోహన్ గుర్తుకు వచ్చాడు" అని చెప్పి బయటకు వచ్చాను. కానీ నా కళ్ళనుండి కారేవి కన్నీరు కాదు. హృదయాంతరాల నుండి పెల్లుబికిన రక్త కన్నీరు అని ఎలా చెప్పను?



## విలియమ్ షేక్స్పియర్ కాదా!

ప్రపంచ ఖ్యాతి గాంచిన కవి, నాటకకర్త అయిన విలియమ్ షేక్స్పియర్ ఇంగ్లండులోని స్టాన్‌ఫర్డ్ అపాన్ ఏవన్ అనే చోట పుట్టారన్న విషయము అందరికీ తెలిసినదే. కాని డివియర్ సొసైటి అనే ఒక సాంస్కృతిక సంస్థ మాత్రం షేక్స్పియర్ వ్రాసిన ప్రపంచ ఖ్యాతి చెందిన 37 నాటకాలు నిజంగా ఆయన వ్రాయలేదని అంటారు. ఎర్ల్ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ ఎడ్వర్డ్ డివియర్ అనే ఆయన వీటిని రచించాడని అంటారు. ఎడ్వర్డ్‌కున్న విద్యా ఘనత, ఆయన చేసిన ప్రపంచ సంచారాలు దీనికి తార్కాణాలుగా చూపిస్తారు. ఈ ఘనతలు షేక్స్పియర్‌కి లేవని గూడా చెబుతారు. ఈ మధ్య ఈ సమితి, ఎడ్వర్డ్ 400 సంవత్సరాల జయంతి వార్షికోత్సవము ఘనంగా జరిపిందట. కూడా! ఈ హడావిడి అంతా చూసిన ప్రొఫెసర్ స్టాన్లీ వెల్స్ (షేక్స్పియర్ బర్త్ ప్లేస్ ట్రస్ట్ చైర్మన్) మాత్రం ఇదంతా అర్థం పర్థం లేని పని అని వ్యాఖ్యానించారట. మీరేమంటారు? – వి.కె. మోహన్